క్లుప్తంగా

బాస్కెట్ బాల్ రన్నర్స్‌గా విష్ణు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ బాస్కెట్ బాల్ పురుషుల టోర్నీలో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారని ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం చెప్పారు. ఈనెల 28, 29 తేదీల్లో మైలవరంలోని లక్కిరెడ్డి బాల్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు రన్నర్స్‌గా విజయం సాధించారని తెలిపారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, పీడీ శ్రీనివాసరావు అభినందించారు.

రైతుల ఇబ్బందులతో సాగు కుదేలు



మాట్లాడుతున్న కేశవరావు

సాక్షి, భీమవరం: దేశ వ్యాప్తంగా వరి, ఆక్వాతో సహా అన్ని పంటలు పండించే రైతుల ఇబ్బందులతో సాగు కుదేలు అవుతోందని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు అన్నారు. భీమవరంలో సోమవారం ఆక్వా, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం పంటలకు మద్దతు ధరలు నిర్ణయిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. సదస్సులో మంతెన సీతారాం, జుత్తిగ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారునికి సత్కారం



శృంగవృక్షంలో క్రీడాకారుడిని సత్కరిస్తున్న హాకీ అసోసియేషన్ సభ్యులు

పాలకోడేరు: శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుచున్న పెదపూడి చరణ్ పవన్ సాయిని పశ్చిమగోదావరి జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి ఆనందరాజు, భరత్, సీనియర్ హాకీ క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల చెన్నైలో సబ్ జూనియర్ మెన్ సౌత్ జోన్ చాంపియన్ షిప్– 2023 పోటీలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని బ్రాంజ్ మెడల్‌ను సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని సర్పంచ్ జంగం సూరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

నేడు కొంతేరులో పౌర హక్కుల దినోత్సవం

యలమంచిలి: పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు కొంతేరు గ్రామంలోని శ్రీ కుంతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మాతా సునీల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ ముఖ్యఅతిథిగా రానున్నారని పేర్కొన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

9న వరసిద్ధి వినాయకుని కల్యాణం

పాలకొల్లు అర్బన్: కాణిపాకం వరసిద్ధి వినాయకుని ఉత్సవ మూర్తులకు పాలకొల్లులో నవంబర్ 9న కల్యాణం, శాంతి హోమం, అభిషేకాలు నిర్వహించనున్నారు. పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సేవ్ టెంపుల్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి, క్షత్రియ సంక్షేమ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కేవీ కృష్ణవర్మ, డాక్టర్ కేఎస్ పీఎస్ వర్మ, భూపతిరాజు రామచంద్రరాజు, డీటీడీసీ బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుడిలా పనిచేయాలి

పాలకొల్లు అర్బన్: మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులందర్నీ కలుపుకుని పార్టీ విజయానికి సైనికుడిలా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా నియమితులైన విప్పర్తి ప్రభాకరరావు సోమవారం గోపిని కలిసి శాలువాతోసత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబును కూడా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గోపి పార్టీ మండల కన్వీనర్ ప్రభాకరరావుకు పలు సూచనలు చేశారు.

పేదవాని ఆరోగ్యమే సీఎం జగన్ లక్ష్యం



పాలకోడేరు: గరగపర్రులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీపీ చంటిరాజు



భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



భీమవరం: పౌష్టికాహార ప్రదర్శన దృశ్యం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పాలకోడేరు: సీనియర్ నాయకుడ్ని, అనుభవజ్ఞుడ్ని అని చెప్పుకుంటున్న గతంలో చంద్రబాబు పాలనకు, యువకుడు, చిన్నవాడైన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనను బేరీజు వేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం గరగపర్రులో ఉప సర్పంచ్ తోకల సునీత సాల్మన్ రాజు, ఎంపీటీసీ షేక్ పాపా సాహెబ్ ఆధ్వర్యాన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు బడికి వెళ్తుంటే యూనిఫాం, బూట్లు, పుస్తకాలు, బాగ్‌లు ఇచ్చి, నాణ్యమైన చదువును చెప్పిస్తున్నారని, తల్లిదండ్రులకు భారం కాకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా కానుక ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తూ, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ అందిస్తూ ఏటా రూ.250 చొప్పున పెంచుకుంటూ ప్రస్తుతం రూ.2750 అందిస్తున్నారని, జనవరి నుంచి రూ.3 వేలు చొప్పున ఇస్తారని పీవీఎల్ వివరించారు. ఇవన్నీ ఒకెత్తు కాగా ప్రతి పేదవాడు ఆరోగ్యంతో ఉండాలని ఒకవైపు ఆరోగ్యశ్రీ అమలు చేస్తూ ఇంకా మిగిలిన వారంతా కూడా అనారోగ్యంతో ఉండకూడదని వైద్యులనే స్వయంగా ఇళ్ళకు పంపి సేవలు అందించడం దేశ చరిత్రలోనే గొప్ప అధ్యాయం అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఈ పథకాలన్నీ అందుతాయని, లేకపోతే ఇవన్నీ రద్దు అవుతాయని కూడా ఊటంకించారు. కాబట్టి మళ్లీ మన జగనన్నకే ఓట్లు వేసి ఈ పథకాలను మరలా మరలా శాశ్వతం చేసుకోవాలని నర్సింహరాజు పిలుపునిచ్చారు. అనంతరం వైద్య శిబిరాన్ని, అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, ఉప సర్పంచ్ తోకల సునీత సాల్మన్ రాజు, ఎంపీటీసీ షేక్ పాపా సాహెబ్, ఉండి ఏఎంసీ వైస్ చైర్మన్ చేకూరి నరేంద్రరాజు, డైరెక్టర్ గుండు నాగేశ్వరరావు, భూపతిరాజు వంశీకృష్ణంరాజు, కటిక శ్రీదేవి, పాలా రాధాకృష్ణ గరగపర్రు అబ్బులు, వెంకన్న, గుంటపల్లి శ్రీనివాస్, కర్తక ఏసు, అవతారం, బొక్కా రాంబాబు, గెడ్డం జోషి, డాక్టర్ డీఆర్ స్వర్ణలత, సర్పంచులు కడలి నాగేశ్వరి, బొల్లా శ్రీనివాస్, గొట్టుముక్కల శివాజీ రాజు, ఎంపీటీసీలు కె.నాగలక్ష్మి, పాలా జ్యోతి, చెల్లబోయిన పాపారావు, జీవీ నరసింహారావు నాయకులు, కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

భీమవరం(ప్రకాశంచౌక్): దైనందిన జీవితంలో ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని 9, 22, 36 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరిగాయి. ఈ శిబిరాలను పర్యవేక్షించిన ఆయన మాట్లాడారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, పార్టీ నాయకులు గూడూరి ఉమాబాల, గాదిరాజు తాతరాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, రేవూరి గోగురాజు, వేండ్ర విజయ దుర్గ, గంటా సుందర్‌కుమార్, నందమూరి ఆంజనేయులు, పి.సత్యనారాయణరాజు, పాలవెల్లి మంగ, కానుబోయిన వెంకటరమణ, బగ్గి జయరాం, పతివాడ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన

సాక్షి, భీమవరం: పట్టణంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యాన ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఆరోగ్య సురక్ష శిబిరానికి వస్తున్న ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించడంతో పాటు అంగన్‌వాడీలో నమోదైన గర్భిణులు, బాలింతలు, పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారు. అలాగే రాగిజావ పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజిని, అంగన్‌వాడీ టీచర్స్ మేరీ గ్రేస్, మాధవి, వెంకటేశ్వరమ్మ, మంగామణి, పద్మ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సోమవారం ఎలక్షన్స్, రీ సర్వే మ్యూటేషన్స్, స్వమిత్వ, జగనన్న కాలనీల గృహ నిర్మాణాలు, స్థల సేకరణ, స్పందన గ్రీవెన్స్, తదితర అంశాలపై మండలాల వారీగా సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. మండలాల్లో పొలిటికల్ పార్టీలు సమావేశం నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వారిగా డూప్లికేట్, షిఫ్టింగ్, జంక్, మరణించిన ఓటర్లు, కొత్త ఓటర్లు నమోదు వంటి అంశాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలు, విధి విధానాలను పూర్తిగా తెలుసుకుని స్పష్టమైన అవగాహనతో సేవలు అందించాలన్నారు. స్పందన గ్రీవెన్స్‌లో 90 రోజులలో ఇంటి స్థలం దరఖాస్తు, మ్యూటేషన్స్‌పై ఎక్కువ ఫిర్యాదులు వచ్చినవే వస్తున్నాయని, వాటిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. అడ్మిషన్ పూర్తయిన ఇంటర్ విద్యార్థుల డేటాను స్టూడెంట్ ఇన్ఫోలో ఇంకా అప్‌డేట్ చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, తాడేపల్లిగూడెం ఆర్డీఓ కె.చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, డీఎల్‌డీఓ కేసిహెచ్ అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి



జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సాక్షి, భీమవరం: ఆకివీడులో ముఠా కార్మికులపై దాడి చేసిన రౌడీ మూకలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యాన సోమవారం జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్‌కు బాధిత కుటుంబసభ్యులతో కలిసి నాయకులు వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన ఆకివీడులో అమాయక హమాలీ కార్మికులపై నేర చరిత్ర కలిగిన రౌడీలు అన్యాయంగా దాడి చేయగా ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావు, డి.రవితేజ, బి.రాంబాబు, ఎం.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో ర్యాలీ

ఆకివీడు: ఇటీవల జరిగిన ఘర్షణలో గాయపడిన ముఠా కార్మికుల కుటుంబాలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కార్మికులకు మద్దతుగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అయిభీమవరం టర్నింగ్ వద్ద నుంచి గుమ్ములూరు సెంటర్ వరకు కొనసాగింది. యూనియన్ నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, ఎం.సత్యం, అచ్చయ్య, రమణ, బి.అప్పల నాయుడు, నెల్లి సూరిబాబు, పి.రమణ, ప్రజా సంఘాల నాయకులు రవితేజ, బీవీ వర్మ, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

10న ధన్వంతరి స్వామి జయంతి ఉత్సవాలు

సాక్షి, భీమవరం: వచ్చేనెల 10వ తేదీన ధన్వంతరి స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నాయీ బ్రాహ్మణ సంఘాలు పిలుపునిచ్చాయి. భీమవరం మెంటేవారి తోటలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో సోమవారం పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, భీమవరం డివిజన్ నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం, భీమవరం ఏరియా మంగళవాయిద్య కళాకారుల సంఘ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నవంబర్ 10న కమ్యూనిటీ హాలులో పెద్ద ఎత్తున ధన్వంతరి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలువురు వైద్యులను సత్కరిస్తామని తెలిపారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణ, సీహెచ్ బంగారరావు, భీమవరం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీమన్నారాయణ, కె.నాగేశ్వరరావు, ఎం.రఘుబాబు, దుర్గారావు, మావుళ్ల పాల్గొన్నారు.

పోలీసు బ్యాండ్ ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న ఎస్పీ రవిప్రకాష్, పోలీస్ అధికారులు

సాక్షి, భీమవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని, సోమవారం భీమవరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బ్యాండ్ ప్రదర్శన వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించి అమరులైన పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవార్థం వారు చేసిన అత్యున్నత త్యాగాలను స్మరించుకుంటూ, అసువులు బాసిన పోలీసు శాఖ అధికారులకు, సిబ్బందికి ఈ ప్రదర్శన అంకితం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, భీమవరం డీఎస్పీ శ్రీనాథ్ పాల్గొని బ్యాండ్ ప్రదర్శన చేసిన వారిని అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భీమవరం వన్ టౌన్, టూటౌన్ సీఐలు, ట్రాఫిక్ సీఐ, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



స్థానిక సిద్ధాపురం రోడ్డుపైకి వచ్చిన చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం రోడ్డులో వేసిన చెత్తను తొలగించే చర్యల్ని నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టారు. జేసీబీతో సోమవారం ఆ ప్రాంతంలోని చెత్తను ఖాళీ ప్రదేశాల్లోకి నెట్టిస్తున్నారు. సిద్ధాపురం వంతెన సమీపంలో ఉన్న ప్రదేశం డంపింగ్ యార్డుకు సరిపోకపోవడంతో చెత్త రోడ్డుపైకి చొచ్చుకువస్తుంది. నగర పంచాయతీ పారిశుద్ధ్య వాహనాలు లోపలకు వెళ్లే మార్గం లేకపోవడంతో రోడ్డుమార్జిన్‌లో వేయడం వల్ల వాహనచోదకులకు, ఆయా ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడటాన్ని గుర్తించిన నగర పంచాయతీ వెంటనే రోడ్డు మార్జిన్ ప్రాంతంలో ఉన్న అపారిశుద్ధ్యాన్ని జేసీబీతో వెనక్కి నెట్టిస్తున్నారు. డంపింగ్ యార్డు కోసం స్థల సేకరణకు ప్రయత్నాలు చేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ కృష్ణ మోహన్ తెలిపారు. చెత్తను రోడ్డుపైకి వేయకుండా చర్యలు తీసుకుంటామని, పారిశుద్ధ్య కార్మికులకు సూచనలిచ్చామని ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



భూమిపూజలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రుద్రరాజు రామరాజు, వైఎస్సార్ సీపీ మండల యువత అధ్యక్షుడు కాటారి లక్ష్మీపతిరాజు తెలిపారు. మండలంలోని జువ్వలపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. గ్రామంలో తూర్పుకాపుల పేట నందు మండల పరిషత్ నిధులు సుమారు రూ.6 లక్షలు, పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో 200 మీటర్లు మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సర్పంచ్ మీసాల రమణ, ముదుండి సురేష్, ఎంపీటీసీ సభ్యుడు మీసాల శ్రీనివాస్, గుర్రం జార్జి బెన్‌హార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలి

నరసాపురం: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి సూచించారు. ఆర్టీసీ డిపోలో చేపట్టిన కార్గో సర్వీస్‌ల డోర్ డెలివరీ మాసోత్సవాలలో భాగంగా సోమవారం డోర్ డెలివరీ చేసిన వారి వివరాలు లక్కీ డ్రా నిర్వహించారు. ముగ్గురు విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా సరుకుల రవాణా తక్కువ చార్జీలతో అందిస్తున్నట్లు చెప్పారు. 50 కిలోల బరువు ఉన్న పార్సిల్స్‌ను 10 కిలోమీటర్ల వరకూ డోర్ డెలివరీ చేయడానికి సంస్థ సదుపాయం కల్పించిందని తెలిపారు. డోర్ డెలివరీ సర్వీస్‌లను ప్రోత్సహించడానికి లక్కీడ్రా నిర్వహించామన్నారు.

పోలీసు స్పందనలో 18 ఫిర్యాదులు

సాక్షి, భీమవరం: స్పందన ఫిర్యాదులు అన్నింటిపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ రవిప్రకాష్, ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 18 ఫిర్యాదులు అందగా, వాటిలో వరకట్న వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

ఆకివీడులో 6 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపినట్లు తెలిపారు.

దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను చెప్పారు. ఆదివారం రాత్రి భీమవరం బుధవారం మార్కెట్ ప్రాంతంలో కానిస్టేబుల్ కె.నాగేంద్ర విధులు నిర్వర్తిస్తుండగా బట్టల షాపులో పనిచేసే శీలం దుర్గాప్రసాద్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా మోటారు సైకిల్ నడుపుతుండగా నాగేంద్ర ప్రశ్నించడంతో అతనిపై దుర్గాప్రసాద్ దౌర్జన్యం చేశాడని కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను చెప్పారు.

సులభ్ కాంప్లెక్స్ వద్దంటూ రైతుల నిరసన

పెనుగొండ: పెనుగొండ కళాశాల కూడలిలో మండల పరిషత్ నిధులతో నిర్మించ తలపెట్టిన సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం వద్దంటూ ఆచంట ఛానల్ పరిధిలోని రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం నిర్మాణ పనులు ప్రారంభం కాగానే రైతులు అక్కడకు చేరుకుని నిర్మాణం నిలిపి వేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఆచంట ఛానల్ ఇప్పటికే మురికి కూపంగా మారిందని, దీని వలన 960 ఎకరాల ఆయుకట్టు రైతులు ఇబ్బందులు పడతారన్నారు. పంట కాలువలోకి సులభ్ కాంప్లెక్స్ లోని నీరు, మలం మొత్తం పంట కాలువలోకి వస్తుందని విమర్శించారు. నిర్మాణ పనులు నిలిపి వేయాలంటూ ఎంపీడీవో, ఏఈ పీఆర్‌లను కోరారు. ఇప్పటికే మండల పరిషత్‌లోనూ, పంచాయతీలోనూ తీర్మానాలు ఆమోదించడం వలన పనులు ప్రారంభించి ఉండవచ్చునని అధికారులు తెలిపారు. పంట కాలువలోకి ఎటువంటి నీరు వెళ్లకుండా సెప్టిక్ ట్యాంకు నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణం చేయదలచి నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అయితే, రైతులు నిర్మాణంపై అభ్యంతరం తెలపడంతో నిర్మాణ పనులు నిలిపినట్లు వారు తెలిపారు.

వైద్యులు, అధికారులకు సన్మానం

యలమంచిలి: వైద్యులు, వైద్య సిబ్బంది, అధికార యంత్రాంగం సమన్వయంతో సమర్థవంతంగా పని చేయడం వలనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మండలంలో ఆఖరి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మట్లపాలెంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల రోజులు వైద్య సేవలు అందించిన వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యగులను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు చల్లా విశ్వేశ్వరరావు (నల్లయ్య) నాయకత్వాన సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, సర్పంచ్ చల్లా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కడలి సునీత, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి విరాళం

సాక్షి, భీమవరం: ఏలూరు జిల్లా ఉంగుటూరులో నిర్మించే వృద్ధులు, అనాధ పిల్లల ఆశ్రమం నిర్మాణానికి అపుస్మా తరపున భీమవరం ఆదిత్య స్కూల్ నుంచి రూ.2 లక్షలు విరాళంగా అందించినట్లు స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు సోమవారం చెప్పారు. ఎకరం విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఆనంద నిలయం భవన నిర్మాణానికి స్కూల్ విద్యార్థులు సేకరించిన మొత్తంతో పాటు మేనేజ్‌మెంట్ కలిపి రూ.2 లక్షల నగదును ఆనంద నిలయం కార్యదర్శి సాగిరాజు జానకీరామరాజుకు అందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కేవీ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

భీమవరం : శ్రీరాంపురంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం నందు 32వ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పెయింటర్స్ అండ్ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు జ్యోశుల మల్లికార్జునరావు పర్యవేక్షణలో అర్చకులు బ్రహ్మజ్యోశుల ప్రసాద్, సుబ్రహ్మణ్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 3 వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. తోట భోగయ్య, కోడె యుగంధర్, గాదిరాజు తాతారాజు మాట్లాడుతూ దైవ కార్యక్రమాల్లో అన్నసమారాధన నిర్వహించడం భగవత్ సేవతో సమానమని అన్నారు. ఆలయ కార్యదర్శి లంకా నాగరాజు, ఉపాధ్యక్షుడు నంద్యాల శ్రీనివాస్, కోశాధికారి పడమట దుర్గారావు, కందికట్ల ఎడ్వర్డ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

సాక్షి, భీమవరం: సాంకేతిక విద్యతో విద్యార్థులు ఉద్యోగం సంపాదించుకోవడమే కాక ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని క్యారీకేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు ఎం.పవన్‌కుమార్ వర్మ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్ పేరిట నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఆర్ అండ్‌డీ డీన్ పీఏ రామకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, కిరణ్‌కుమార్ వర్మ, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హెన్రీ డొనేట్ వర్ధంతి

భీమవరం: రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డొనేట్ వర్ధంతిని సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. జిల్లా చైర్మన్ శివరామ బద్రిరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రక్తం ఆవశ్యకత, రెడ్ క్రాస్ సేవలను కొనియాడారు. సంస్థ సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి మురళీకృష్ణారావు, కో ఆర్డినేటర్ శీలం మల్లేశ్వర, అమూల్యరావు పాల్గొన్నారు.

నోరు అదుపులో పెట్టుకోవాలి

పెనుగొండ: మహాసేన రాజేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. మహాసేన పేరుతో టీడీపీలో చేరి దళితులంతా చంద్రబాబుకు ఓటేసి గెలిపిస్తామని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదమన్నారు. టీడీపీకి ఊడిగం చేసుకోవాలంటే చేసుకోవాలి కానీ, దళితులంతా వచ్చేస్తారని ఎలా చెబుతారని ప్రశ్నించారు. దళితులను ఉద్ధరిస్తానని చెప్పి మహాసేనను తీసుకువెళ్లి చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు. ఇప్పటికైనా జాతిని తాకట్టు పెట్టే ప్రకటనలు చేయవద్దంటూ హితవు పలికారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కాళ్ళ బ్రాంచ్, పంచాయితీ రోడ్, కాళ్ళ
ప:గో:జిల్లా, ఫోన్ నెం.08916-258244, ఇ-మెయిల్ : ubin0806498@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన
(స్థిరాస్తి కొరకు) (రూల్ 8 (1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్ 2002 (2002లో చట్టం 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 సందలి రూల్ 3తో చదివే సెక్షన్ 13(12) ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాళ్ళ బ్రాంచ్ యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు తేది.18.11.2022 న డిమాండ్ నోటీసు జారీ చేయటమైనది. ఋణగ్రహీత : శ్రీ కొప్పర్తి నాగ పాండురంగరావు, సహ-ఋణగ్రహీత : శ్రీమతి కొప్పర్తి సరిత మరియు హామీదారు : శ్రీమతి సుంకర విమలాదేవి వార్లను నోటీసులో తెలియజేయబడిన ప్రకారం బకాయి రూ.14,63,541.80 పై (అక్షరాలా పద్నాలుగు లక్షల అరవై మూడు వేల ఐదు వందల నలభై ఒక్క రూపాయల ఎనభై పైసలు మాత్రమే) సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవల్సినదిగా కోరడమైనది.

ఋణగ్రహీత సదరు మొత్తమును తిరిగి చెల్లించక విఫలమైనందున సదరు 8వ రూల్‌తో చదవబడే సదరు చట్టంలో సెక్షన్ 13(4) క్రింద దిగువ సంతకందారు తనకు సంక్రమించిన అధికారమును వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని తేది.25.10.2023 తేదీన స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయటమైనది.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన రూ.14,63,541.80 పై మరియు వడ్డీతో సహా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాళ్ళ బ్రాంచ్ వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు : ప్రైమరీ సెక్యూరిటీ :
ప:గో:జిల్లా, భీమవరం, కాళ్ళ మండలం, దొడ్డనపూడి గ్రామం, డోర నెం.3-73, ఆర్ ఎస్ నెం.31/3, 4, 5 లో 726 చ:గజాల విస్తీర్ణం గల నివాస భూమి మరియు భవనం యావత్తు ఆస్తి శ్రీమతి కొప్పర్తి నాగ పాండురంగారావు గారి పేరున ఉన్నది.
హద్దులు : తూర్పు : కొప్పర్తి భద్రమ్మ మరియు ఇతరుల స్థలం, దక్షిణం : పబ్లిక్ వీధి, పడమర : కొప్పర్తి భద్రమ్మ మరియు ఇతరుల స్థలం, ఉత్తరం : పబ్లిక్ వీధి.

తేది : 25.10.2023
స్థలం : కాళ్ళ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
Office mail : tpgadvt@gmail.com